క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



పెట్రోల్ బంకు నిర్వాహకుడికి నోటీసు అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో నిర్వాహకులు తప్పనిసరిగా 8–మెగా పిక్సెల్ నైట్ విజన్ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. మంగళవారం పట్టణంలోని పెట్రోల్ బంకులను పరిశీలించారు. నిర్వాహకులకు సీసీ కెమెరాల పనితీరుపై అవగాహన కల్పిస్తూ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేశారు. సీఐ మాట్లాడుతూ పెట్రోల్ బంకుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరం జరిగితే నిందితులను పట్టుకోవడానికి సులభంగా ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కౌతాళం: పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని హాల్వి గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6,500న గదుతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపినట్లు వెల్లడించారు. మండలంలో ఎవరైన సరే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక పనులు చేసినా ఉపేక్షించేది లేదన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో మంగళవారం భవన నిర్మాణం చేపడుతుండగా అదుపు తప్పి భవనంపై నుంచి కింద పడిన వీరేష్ అనే కార్మికుడికి గాయాలయ్యాయి. వెంటనే కార్మికులు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

8న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆదోని అర్బన్: ఈనెల 8న మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో నేషనల్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని కర్నూలు శాంతిరాం ఆస్పత్రి వారితో కలిసి ఏర్పాటు చేస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైపుల్లా తెలిపారు. వారు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా పెద్ద తుంబళం గ్రామంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య పరీక్షలపై మంగళవారం చుట్టుపక్కల గ్రామాలైన జాలుమంచి, బల్లేకల్, గణేకల్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్‌సింగ్, పద్మనాభయ్యశెట్టి, సాబీర్‌బాషా, రాజేష్‌జైన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఓ వరప్రసాద్

పెద్దకడబూరు : రబీ సీజన్‌లో పంటల బీమా కోసం రైతులు ప్రీమియం డబ్బులు చెల్లించాల్సిందేనని ఏఓ ఎం.వరప్రసాద్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకం కింద అర్హత పొందడానికి శనగకు ఎకరానికి రూ. 420, వరికి రూ. 630, జొన్నకు రూ. 297, వేరుశనగకు రూ. 480, ఉల్లి పంటకు రూ. 1350లు చెల్లించాలన్నారు. టమాటకు రూ. 1500లు చెల్లిస్తే వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందని చెప్పారు. వరి పంటకు మాత్రం ఈ నెల ఆఖరిలోపు ప్రీమియం చెల్లించుకోవచ్చునని మిగతా అన్ని పంటలకు ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

గోనెగండ్ల : రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు పంటల బీమా చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. మంగళవారం వారు మాట్లాడుతూ 2024–05 కి గాను రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకము, బ్యాంక్ పాస్ బుక్, కౌలు రైతు ఐతే సీసీఆర్సీ కార్డు తీసుకొని మీసేవ, సీఎస్సీ సెంటర్‌లో నగదు చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఎమ్మిగనూరుకు చెందిన నటరాజ కూచిపూడి నృత్య సంస్కృతి కళాక్షేత్రం వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మనస్విని, మీనాక్షి, లిక్షిత, లాస్య, మౌనిక, చంద్ర, వినిత, శ్రావణి, ప్రీతి తదితరులు నృత్యం చేశారు.

అన్నదాతకు 'ఫెంగల్' దెబ్బ

- తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- కోతకోసిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
- గాలులకు నేలవాలుతున్న పైర్లు
- రాలుతున్న గింజలు
- నష్టపోతున్న రైతులు



ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు



ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

నందవరం: అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఆకాశం మబ్బులు కమ్మి మేఘావృతం కావడంతో పాటు చిరు జల్లులు పడుతున్నాయి. అంతే కాకుండా ఆదివారం, సోమవారం, మంగళవారం మూడు రోజుల పాటు వర్షం కురుస్తునే ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కొన్ని గ్రామాలలో వరి పంట కోతకోయని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఫెంగల్ తుపాన్‌పై రైతులను అప్రమత్తం చేయకుండా కూటమి ప్రభుత్వం ముంచేసిందని వాపోతున్నారు

ధాన్యం తడిస్తే తీవ్ర నష్టం

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3,027 ఎకరాలో వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే 2,048 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. అయితే ఫెంగల్ తుపాను కారణంగా మిగిలిన వరి పంట వర్షాలకు తడిస్తే నష్టం వాటిల్లుతందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన వరి ధాన్యం కూడా కల్లాల్లోనే ఉండటంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. టార్పాలిన్ పట్టలను కప్పుతున్నారు. పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, జొహరాపురం, పూలచింత, కనకవీడు, హాలహర్వి, నాగలదిన్నె తదితర గ్రామాలలో ఆరబోసిన ధాన్యం ఈ ఫెంగల్ తుపాన్ తాకిడికి తడిసి కొంత వరకు నష్టం జరిగే అవకాశం ఉంది. గురజాల, రాయచోటి, నదికైరవాడి, జొహరాపురం, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, నాగలదిన్నె గ్రామాలలో 70 శాతం, మిగిలిన గ్రామాలలో రైతులు 30 శాతం వరి కోతతు పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇంకా కోత కోయని వరి పైరు గాలులు, వర్షాల ధాటికి నేలవాలుతోంది. గింజలు నేలరాలుతున్నాయి.

పంటను కాపాడుకోవడానికానికి అవస్థలు



ఈ ఏడాది 2 ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ఇప్పుడు పండించిన పంట కల్లంలో ఉంది. ధాన్యం వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి నానా కష్టాలు పడాల్సి వస్తుంది. ఒ వైపు కోత మిషన్లు దొరకక ఇబ్బంది. మరో వైపు తుపాన్ తాకిడి ఉండడంతో తడిసిన ధాన్యాన్ని వ్యాపారులు తక్కువ ధరకు అడిగే ప్రమాదం ఉంది. ఈ ఏడాది పెట్టుబడి పెరిగి..ధాన్యం ధర తగ్గడంతో పాటు అకాల వర్షాలతో దిక్కుతోచడం లేదు.

– ఆంజనేయులు, రైతు, జొహరాపురం

అకాల వర్షంతో దిక్కుతోచడం లేదు



ఫెంగల్ తుపాన్ కారణంగా వర్షం పడుతుండటంతో దిక్కుతోచడం లేదు. ఈ ఏడాది బోరు కింద 7 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. మంచి దిగుబడి వస్తుందని ఆశించా. అకాల వర్షాలకు కోత కోయాల్సిన వరి ధాన్యం నేలపాలు అవుతోంది. కనీసం కోత కొద్దామున్న మిషన్లు దొరకడం లేదు. వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరగడంతో గంటకు రూ.3,500 బాడుగ ఇవ్వాల్సివస్తుంది. ఈ తుపాన్ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

– మల్లికార్జున గౌడ్, రైతు, పూలచింత

భక్తుల గదులు ఖాళీ చేయండి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం దాతలు నిర్మించిన గదులను సిబ్బంది ఖాళీ చేయాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తుల కోసం నిర్మించిన గదుల్లో కార్యాలయంలో పని చేసే కొంత మంది సిబ్బంది పర్మినెంట్‌గా ఉండడం ఇక నుంచి కుదరదన్నారు. భక్తుల కోసం నిర్మించిన గదులను వారికే ఇవ్వాలని చెప్పారు. సిబ్బంది ఉండేందుకు వీలులేదన్నారు. ఆలయ సిబ్బంది ఈనెల 10వ తేదీకంతా వాటిని ఖాళీ చేయాలని ఆదేశించించారు.

పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించాలి

పెద్దకడబూరు : ఈ నెల 7న మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించాలని ఎంఈఓ రామ్మూర్తి సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఈ సమావేశానికి ప్రత్యేక పాఠశాలగా ఎంపిక చేయడంతో మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు. సమావేశం నిర్వహణపై ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మఠం భూములు అమ్ముకున్నదెవరు?



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు

ఆదోని రూరల్: హంపీ మఠం భూములు అమ్ముకున్నదెవరో తమ వద్ద ఆధారాలున్నాయని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వెల్లడించారు. నవంబర్ 30వ తేదీన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అమరావతినగర్‌కు చెందిన బీజేపీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ దళిత వైస్ చైర్మన్ నరసింహులు పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ.. తన భర్త మధుసూదన్‌శర్మ హంపీ మఠం భూముల అవినీతిని నిరూపించాలని సవాలు విసిరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ద్వారకా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ శ్రీలక్ష్మి, ఆదోని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు మాట్లాడారు. బీజేపీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, ఆమె భర్త మధుసూదన్‌శర్మల హంపీ మఠం భూముల విక్రయించినట్లు ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. ఆదోని, చిప్పగిరి, ఆలూరు, హొళగుంద మండలాల్లో ఉన్న హంపీ మఠం భూములను వెల్లాల మధుసూదనశర్మ కౌలు రైతులకు అమ్మివేశాడని చెప్పారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్ల కాపీలు తమ దగ్గర ఉన్నాయన్నారు. నంద్యాలలో హంపీ మఠానికి సంబంధించిన భూమి విషయంలో కూడా విక్రయానికి పాల్పడడంతో ఆయనపై 420 కేసు నమోదయ్యిందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, చలపతి, అశోక్, బాలాజీ, కిషోర్, నాయకులు నాగరాజు, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన ఆలయం

ఘనంగా కార్తీక పూజోత్సవం



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రజల ఆరాధ్య దైవం కడపాళెం వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక పూజోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం వేకువజామున నుంచి ఆలయ అర్చకులు శ్రీరాములు స్వామి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ దీపోత్సవం, పూజలు ప్రారంభించారు. భక్తులు మొక్కుబడిగా తెచ్చిన వేలాది పుష్పాలతో అలంకరణలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించి, నారికేలాలు సమర్పించి పూజలు చేసుకున్నారు. అలాగే ఆలయం ఎదురుగా కొండపై వెలసిన తిమ్మప్ప స్వామికి విశేష పూజలు చేసి ధ్వజస్తంభంపై దీపోత్సవం చేపట్టారు.

ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల

గోనెగండ్ల : గాజులదిన్నె ప్రాజెక్టు ఆయకట్టు భూములకు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మంగళవారం జీడీపీ అధికారులతో కలిసి సాగునీటిని విడుదల చేశారు. జీడీపీ కుడి కాలువ నుంచి 25 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి 30 క్యూసెక్కుల నీటిని తూము ద్వారా వదిలారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలోని వేముగోడు గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో జీడీపీ డీఈ విజయ్ కుమార్, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ మణి మంజరి, ఏఈ మహమ్మద్ అలీ, పీఆర్ఏఈ శివ శంకర్ పాల్గొన్నారు.

6న ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఆలూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రాజ్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ,యువకులు శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు కావాలన్నారు. ఉద్యోగుల ఎంపికకు అమరరాజా గ్రూప్, నవ భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు వయస్సు 35 ఏళ్ల లోపు ఉండి పది, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ అర్హత సాధించి ఉండాలి. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

మద్దికెర : మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ఆశాడే నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ కాన్పులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

అపార్ నమోదు వంద శాతం పూర్తి కావాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: డివిజన్‌లో ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) వంద శాతం పూర్తి కావాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ వారి కార్యాలయంలో అపార్ తక్కువ శాతం నమోదైన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల హెచ్‌ఎంలు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అపార్ తక్కువ శాతం నమోదు కావడానికి గల కారణాల గురించి ఆరా తీశారు. ఎక్కువగా రిజెక్షన్లు ఉన్నాయని, ఇందులో పేరు, వయస్సు, జెండర్ తప్పులు ఉన్న వాటిని ఉపాధ్యాయులు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వద్ద సరి చేయించాలన్నారు. ఆదోని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు, ఎమ్మిగనూరు ఎంఈఓ ఆంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



రికార్డులు, నంబర్ ప్లేట్స్‌లేని బైకలను స్వాధీనం చేసుకున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు

ఎమ్మిగనూరురూరల్: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ.. సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని శక్తినగర్, ఎన్టీఆర్ కాలనీ, శివన్న నగర్, శాంతి నగర్, వెంకటాపురం, లక్ష్మీపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అన్ని ఇళ్లలో సోదాలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో రికార్డులు లేని, నంబర్ ప్లేట్స్ లేని 8 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తనిఖీల్లో సీఐలు శ్రీనివాసులు, మంజునాథ్, రామాంజులు, ఎస్ఐలు డాక్టర్ నాయక్, శ్రీనివాసులు, నిరంజన్‌రెడ్డి, వి. శ్రీనివాసులు, పరమేష్‌నాయక్, 50 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వందగల్లు పాఠశాలలో విచారణ



వందగల్లు పాఠశాలలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకటరమణ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డిప్యూటీ డీఈఓ వెంకటరమణ రెడ్డి విచారణ చేపట్టారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల ఆ పాఠశాలలో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని 22–12–2023న విద్యార్థిని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్త్రీశిశు సంక్షేమ శాఖ సీడీపీఓ నాగమణి, ఎంఈఓ–2 శోభరాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కాత్యాయనిలతో కలిసి విద్యార్థిని, తల్లిదండ్రులను విచారణ చేపట్టారు. అలాగే డిప్యూటీ డీఈఓ పాఠశాల హెచ్‌ఎం గోవింద రాజు, ఉపాధ్యాయులను విచారించారు. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులతో రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నామన్నారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తామని ఆయన తెలిపారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీకుమార్

ఎమ్మిగనూరురూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల పిల్లలు విష జ్వరాల బారిన పడుతున్నారని ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో, చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ బాలాజీకుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. తల్లులు పిల్లలకు వెచ్చని స్వెటర్స్, చేతులకు, కాళ్లకు సాక్సులు వేయించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగించాలని సూచించారు. జ్వరాలు ఒకరి నుంచి మరొకరికి సోకకుండా వీలైతే మాస్కులు ధరించటం చాలా మంచిదని చెప్పారు. వైరల్ ఫీవర్స్ సోకి వైద్యం కోసం వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందని, అందుకే ముందుగానే జాగ్రత్తలు పాటిస్తే జ్వరాల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చునన్నారు.

చెత్తతో స్వాగతం!





కుంటనహాల్ గ్రామ ముఖద్వారం వద్ద పారిశుద్ధ్యం ఇలా..., ఉప్పరహాల్ ముఖద్వారం వద్ద

- గ్రామ ముఖద్వారాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- పందుల స్వైరవిహారం

కౌతాళం: గ్రామ ముఖద్వారాల వద్ద పారిశుద్ధ్యం సమస్య తీవ్రంగా ఉంది. గ్రామాల్లోకి ప్రవేశించే ప్రధానం రహదారుల వద్ద గ్రామానికి వచ్చే వారికి చెత్తాచెదారం, దుర్వాసన స్వాగతం పలుకుతోంది. ఆయా గ్రామాలకు చెందిన చెత్తాచెదారం పూర్తిగా అక్కడే వేయడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. చెత్తచెదారంతో చిన్నపాటి వర్షం వచ్చిన దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామం ముఖద్వారం వద్దే పరిస్థితి ఇలా ఉంటే గ్రామంలో ఎలా అని ఆయా గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో ఆదోని మెయిన్ రోడ్డులోనే పూర్తిగా చెత్తాచెదారం వేస్తుండడంతో అక్కడే పందులు సంచరిస్తూ పరిసరాలను మరింత అధ్వానంగా మారుస్తున్నాయి. ఉప్పరహాల్ గ్రామంలో పరిస్థితి కూడ ఇలాగే ఉంది. ఆదోని నుంచి కుంటనహాల్ మీదుగా గ్రామానికి చెరుకుని ప్రధాన రహదారిలో ఇలాంటి పరిస్థితే ఉంది. అదేవిధంగా మండల కేంద్రమైన కౌతాళంలోని తహసీల్దారు కార్యాలయంలో వద్ద పరిస్థితి ఇలాగే తయారైంది. గ్రామ ప్రవేశ ద్వారాల వద్ద చెత్తచెదారం లేకుండా అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



గోనెగండ్లలో దివ్యాంగులకు టిఫిన్ బాక్సులు పంపిణీ చేసిన దృశ్యం,



ఆదోనిలో దివ్యాంగ విద్యార్థులతో ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్



పెద్దకడబూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, విద్యార్థులు



ఎమ్మిగనూరులో దివ్యాంగుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈఓ ఆంజినేయులు

గోనెగండ్ల: దివ్యాంగులను వారి తల్లిదండ్రులు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే వారికన్నా గొప్పవారు లేరని నిరుపించుకుంటారని సీఐ గంగాధర్, ఎంఈఓ నీలకంఠ తెలిపారు. స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని విభిన్న ప్రతిభా వంతుల ఉపాధ్యాయులు అనురాధ, నారాయణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గోనెగండ్లకు చెందిన వ్యాపార వేత్త ప్రసాద్ శెట్టి భవిత కేంద్రంలో 30 మంది దివ్యాంగులకు టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరిమళ, శిరోమణి, బాబు, సీఆర్పీ పుల్లన్న, రవి, గానిగ బాష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

ఆదోని సెంట్రల్: దివ్యాంగులను ప్రోత్సహించాలే తప్ప వారిని కించపరిచే విధంగా మాట్లాడకూడదని మండల విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం నిర్మలమ్మ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శాంతకుమార్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని మెయిన్ పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. మండల విద్యాధికారులు సువర్ణల సునీమం, రామమూర్తి ఆధ్వర్యంలో బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెయిన్ పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఎంఐఎస్ కో–ఆర్డీనేటర్ లక్ష్మన్న, సీఆర్పీ కృష్ణాచారి పాల్గొన్నారు.

నందవరం : మండల కేంద్రంలోని ఐఈఆర్టీ నాన్ భవిత కేంద్రంలో ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్పెషల్ స్కూల్ హెచ్‌ఎం దుబ్బన్న, సీఆర్ఎంటి ఉరుకుందు, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సెక్రెడ్ సంస్థ, విజేత వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలను సమాఖ్య అధ్యక్షుడు దుగ్గప్ప, ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, ఐకేపీ వెలుగు ఆఫీసు ఈరన్న, మండల న్యాయాధికారులు లోకేష్, నవీన్ రెడ్డి, రమాదేవి, మహమ్మద్‌హైదర్ అలీ, హెచ్.నాగరాజు హాజరై మాట్లాడారు.

ఎమ్మిగనూరుటౌన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో భవిత కేంద్రం నుంచి దివ్యాంగుల ర్యాలీని ఎంఈఓ– 1 ఆంజినేయులు ప్రారంభించారు. అనంతరం భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఇర్షాద్, ఉపాధ్యాయులు ఆనంద్, రంగన్న, సుబ్రహ్మణ్యం,ఐఈఆర్టీలు బాబు తదితరులు పాల్గొన్నారు.